
సాక్షి
కుమురం భీం

శుక్రవారం ◆ 3 ◆ నవంబర్ ◆ 2023



నెల రోజులు.. రెండు ఎన్నికలు!
నెల రోజుల వ్యవధిలోనే అసెంబ్లీ, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. కార్మికులు తమ ఓటుతో రెండు రకాల తీర్పులు ఇవ్వబోతున్నారు. IIలో▸



అభివృద్ధికి ఆమడదూరం
కెరమెరి మండలంలోని లైన్‌పటార్ గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గ్రామస్తులకు రవాణా సదుపాయం, పక్కా ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
33.6 /22.1

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కూడా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సీఎం సభాస్థలి పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, నాయకులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 8న బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ, హెలిప్యాడ్ స్థలాలను గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు పరిశీలించారు. పార్టీ నాయకులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై చర్యలు



జ్యోతికిరణ్, జిల్లా ఎక్సైజ్ అధికారి

ఆసిఫాబాద్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, అనుమతి లేని నిల్వలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మద్యం అక్రమ డంపీలతోపాటు నకిలీ మద్యంపై సమాచారం అందించాలని కోరారు. మద్యం ప్రభావం లేకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. జిల్లా ప్రజలు 18004242423, 08733293933, 8712658783, 8712658784 నంబర్లలో సమాచారం అందించాలని సూచించారు.

నేడు నామినేషన్ దాఖలు చేయనున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన రావి శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించారు. గుంటూరు కాలనీలోని తన నివాసం నుంచి ఉదయం నామినేషన్ వేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సిర్పూర్(టి)లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రానికి వెళ్లనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

11న మాదిగ విశ్వరూప మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రేగుంట కేశవ్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం సంఘం నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రేగుంట మహేశ్, రాజలింగు, నగేశ్, మురళి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఎన్నికల విధుల నుంచి వివిధ సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ మాట్లాడుతూ దివ్యాంగులు, పాలిచ్చే తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని కోరారు.

5న 'బౌద్ధ మహాసభ' సమావేశం

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్షాభూమిలో ఈ నెల 5న భారతీయ బౌద్ధ మహాసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహోల్కర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించే ఈ సమావేశానికి బీఎస్ఐ రాష్ట్ర ఆర్గనైజర్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి నూతన కమిటీలను ఎన్నుకుంటామన్నారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నామినేషన్లకు వేళాయె!

- నేటి నుంచి వారం రోజులపాటు ప్రక్రియ
- ఆసిఫాబాద్, సిర్పూర్(టి)లో ఏర్పాట్లు
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- ముహూర్తాల వేటలో అభ్యర్థులు
- 9వ తేదీన నామినేషన్ల సమర్పణకు ఆసక్తి



ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం



సిర్పూర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం

సాక్షి, ఆసిఫాబాద్: శాసనసభ ఎన్నికల క్రతువులో కీలకమైన నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు(ఆర్వోలు) ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ దాసరి వేణు, సిర్పూర్(టి) తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించి చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయ్యింది. రిటర్నింగ్ అధికారి కార్యాలయాల ఎదుట పోలీసులు 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి.. ర్యాలీగా వచ్చిన వారి వాహనాలు, ప్రజానీకాన్ని ప్రధాన రహదారి దగ్గరే నిలిపివేయనున్నారు. అభ్యర్థితోపాటు నలుగురు ప్రతిపాదిత సభ్యులను మాత్రమే అనుమతించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

నామినేషన్‌కు ఫారం- 2బీ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఫారం- 2బీ ద్వారా నామినేషన్ పత్రాలు సమర్పించాలి. దీంతోపాటు ఫారం- 26 ద్వారా అఫిడవిట్ సైతం సమర్పించాల్సి ఉంటుంది. దీంట్లో అభ్యర్థికి సంబంధించిన ఆస్తులు, రాబడి, ఖర్చులు, అప్పులు, క్రిమినల్ కేసులు వంటి అన్ని వివరాలు నమోదు చేయాలి. అఫిడవిట్‌లోని కాలమ్స్ అన్నీ తప్పనిసరిగా పూర్తిచేయాలి. లేనిపక్షంలో రిటర్నింగ్ అధికారి నోటీసు జారీ చేస్తారు. నామినేషన్ల పరిశీలన తేదీ కంటే ముందుగానే అభ్యర్థికి ఈ నోటీసు జారీ చేసి అన్ని కాలమ్స్ పూర్తి చేయిస్తారు.

ప్రతిపాదిత సభ్యులు..

జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థి నామినేషన్ పత్రం దాఖలు చేసే సమయంలో సదరు అభ్యర్థిని అదే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాలి. అభ్యర్థి అదే రాష్ట్రంలోని ఏ నియోజకవర్గం నుంచైనా ఓటుహక్కు కలిగి ఉండాలి. రిజిస్టర్డ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులను మాత్రం అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు బలపరచాలి. ప్రతిపాదకులు నిరక్షరాస్యులైతే ఆర్వో ఎదుట నామినేషన్ స్వీకరణ సమయంలో వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.

ఏడు రోజులే అవకాశం..

ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 5వ తేదీ ఆదివారం సెలవు దినం. దీంతో నామినేషన్ల క్రతువుకు ఏడు రోజులే అవకాశం ఉంటుంది. ఈ నెల 13న నామినేషన్ల స్క్రూటినీ ఆఖరు తేదీ కాగా.. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15 చివరి గడువు. అదేరోజు ఆయా నియోజకవర్గాల్లో ఎంతమంది అభ్యర్థులు బరిలో ఉన్నారనేది తేలనుంది.

'తొమ్మిది'పై మక్కువ..

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు మంచి రోజు.. బలమైన ముహూర్తం చూసుకుంటున్నారు. ఆ మేరకు ముహూర్తాల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. శుక్రవారం నుంచి వారం రోజులపాటు జరిగే ఈ ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కువగా తొమ్మిదో తేదీనే నామినేషన్లను వేయడానికి సిద్ధమవుతున్నారు. ఆ రోజు ఏకాదశి, ముహూర్తం బాగుందనే సమాచారంతో ఎక్కువ మంది తొమ్మిదిన నామినేషన్లు వేయనున్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు కోవ లక్ష్మి, కోనేరు కోనప్ప ఈ నెల 9న నామినేషన్లు వేయనున్నారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సైతం 9న నామినేషన్ వేయనున్నట్లు తెలిసింది.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు నామినేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని రిటర్నింగ్ అధికారులు దాసరి వేణు, దీపక్ తివారి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం, సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి సిర్పూర్(టి) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వారు వెల్లడించారు.

100 మీటర్ల వరకు 144 సెక్షన్..

నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి వంద మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ ర్యాలీలు నిలిపివేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఆసిఫాబాద్ బరిలో
ఆత్మారాంనాయక్



ఆత్మారాం నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

- టికెట్ కేటాయించిన బీజేపీ అధిష్టానం
- జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణుల సంబురాలు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థిగా రెబ్బెన మండలం ఖైరిగూడకు చెందిన అజ్మీరా ఆత్మారాంనాయక్‌ను ఆ పార్టీ ఖరారు చేసింది. తొలి విడతలో సిర్పూర్ అభ్యర్థిగా పాల్వాయి హరీశ్‌బాబును ప్రకటించగా ఆసిఫాబాద్‌ను పెండింగ్‌లో ఉంచింది. టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాంనాయక్ పేర్లను అధిష్టానం పరిశీలించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి సైతం హైదరాబాద్‌లో బీజేపీ పెద్దలను కలిశారు. ఆసిఫాబాద్ టికెట్‌పై ఆమె హామీ పొందినట్లు ప్రచారం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్(ఎస్టీ) టికెట్ లంబాడా సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు కేటాయించడంతో ఆసిఫాబాద్‌లో గోండు సామాజిక వర్గానికి అవకాశం ఇస్తారని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గురువారం విడుదలైన జాబితాలో ఆసిఫాబాద్ అభ్యర్థిగా ఆత్మారాంనాయక్‌ను ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది.

రెండోసారి బరిలో..
గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఆత్మారాంనాయక్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు స్వల్ప మెజార్టీతో టీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిపై విజయం సాధించగా, ఆత్మారాంనాయక్ 6,711 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2004 నుంచి 2018 వరకు టీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆత్మారాం నాయక్‌పై తెలంగాణ ఉద్యమ సమయంలో పలు కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. ఇటీవల పోడు భూముల కోసం చేసిన ఆందోళనలో కేసు నమోదు కావడంతో జైలుకు సైతం వెళ్లారు.

పార్టీ శ్రేణుల సంబురాలు
భారతీయ జనతా పార్టీ ఆసిఫాబాద్ అభ్యర్థిగా అజ్మీరా ఆత్మారాంనాయక్‌ను ప్రకటించడంతో గురువారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. అంబేద్కర్ చౌక్ వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. అంతకుముందు ఆత్మారాం నాయక్‌ను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కుమురం వందన, రాధిక, సొల్లు లక్ష్మి, శ్రీధర్, ఖాండ్రే విశాల్, జయరాజ్, సందీప్ రాథోడ్, సంతోష్, సంజీవ్, ప్రకాశ్, తిరుపతి, జగన్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

బయోడేటా



పేరు: అజ్మీరా ఆత్మారాంనాయక్
తండ్రి: చంద్రు నాయక్
భార్య: సంధ్యా రాణి (ఖైరిగూడ సర్పంచ్)
పుట్టిన తేదీ: 15- 01- 1987
విద్యార్హత: బీఎస్సీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్
వృత్తి: వ్యాపారం, వ్యవసాయం
భాషలు: తెలుగు, హిందీ, మరాఠీ, లంబాడీ, గోండి
మాతృభాష: లంబాడా

విధుల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సిర్పూర్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎం, వీవీ ప్యాట్లపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో మహాయాగం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కోనప్ప దంపతులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప దంపతులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో గురువారం నిర్వహించిన త్రికుండాత్మక శ్రీరాజశ్యామల మహాయాగంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్(టి), చెన్నూర్, వరంగల్, హైదరాబాద్‌కు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఈ మహాయాగం కొనసాగుతోంది. గురువారం ఆఖరిరోజు వేదమంత్రాలతో చేసిన పూజలకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నిబద్ధతతో పనిచేస్తే విజయం మనదే

- ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్
- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఏజెంట్లకు శిక్షణ



ముఖ్య నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సుదర్శన్‌గౌడ్

ఆసిఫాబాద్: నిబద్ధతతో పనిచేస్తే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో గురువారం జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాదరావు అధ్యక్షతన పార్టీ ఏజెంట్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ మాట్లాడుతూ తెలంగాణలో అవినీతి పాలన అంతానికి ప్రతీ కార్యకర్త కంకణం కట్టుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకూడదని, అలా అయితే రాష్ట్రం పరిస్థితి అధ్వానంగా మారుతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధి అనూష ఎల్‌ఈడీ ద్వారా ఏజెంట్లకు అవగాహన కల్పించారు. అనంతరం రెబ్బెన మండలానికి చెందిన గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడం సుదర్శన్‌గౌడ్, గాదిగూడ మండలానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రకాశ్ రాథోడ్ వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, నాయకులు అనిల్‌గౌడ్, రాథోడ్ కేశవరావు, షేక్ అసద్, షేక్ కలీం, దీపక్, ఎండీ ఆసిఫ్, గుండా శ్యాం, చరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మళంగా ఆలోచించుండ్రి!

- మీరు వేసే ఓటే మీ తలరాతను నిర్ణయిస్తది
- ఇంద్రకరణ్ సార్ హుషారున్నడు..
- ఒక్కొక్కటి అన్నీ అడుగుతున్నడు
- ప్రజా ఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్
- యూజీడీ, ఇంజినీరింగ్, ఐటీ కావాలి..
- స్వర్ణ కాలువ లైనింగ్ పూర్తిచేయాలి..
- సభలో సీఎంను కోరిన మంత్రి 'అల్లోల'



ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న సీఎం కేసీఆర్

నిర్మల్: 'ఎన్నికలు చాలా వస్తయ్.. పోతయ్. అన్ని పార్టీల నుంచి ఎవరో ఒకరు నిలబడతరు. ఎవరో ఒక్కరు గెలుస్తరు. కానీ.. మీరు వేసే ఓటే ఐదేళ్ల మీ తలరాతను నిర్ణయిస్తది. అందుకే అభ్యర్థుల గురించి తెలుసుకోవాలి. ఏపార్టీకి ఓటేస్తే లాభమో.. ఏ ప్రభుత్వం ఏర్పడితే మంచి జరుగుతదో.. ఎవరికి ఓటియ్యాల్నో గ్రామాలకు పోయినంక నిమ్మలంగా ఆలోచించాలి.. చర్చించాలి' అని అన్నారు సీఎం కేసీఆర్. నిర్మల్ జిల్లాకేంద్రంలోని క్రషర్‌గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'నిర్మల్ జిల్లాను చేసింది నేనే కావచ్చు కానీ.. ఆదిలాబాద్‌ల కొత్త జిల్లాల కోసం తపన పడింది ఇంద్రకరణ్‌రెడ్డే. ఒకరోజు హైదరాబాద్‌ల కూర్చుని జిల్లాల ఏర్పాటు గురించి మాట్లాడుతున్నం. ఆదిలాబాద్ ఎట్లాగున్నది ఇగ మంచిర్యాల ఒకటి చేస్తే సరిపోతుందని ఓ నిర్ణయానికి వచ్చినం. అప్పుడు ఇంద్రకరణ్‌రెడ్డి తన టీమ్‌ను తీసుకుని బయటకు వెళ్లి గంట తర్వాత మళ్లీ వచ్చిండు. సార్ ఇది మీ వల్లనే అయితదన్నడు. ఆదిలాబాద్ జిల్లాల బాగా అడవులు ఉండటం వల్ల దూరందూరంగా ఉన్నాయని, బాసర నుంచి ఆదిలాబాద్, బెజ్జూర్ నుంచి ఆదిలాబాద్ రావాలంటే ఎంతదూరమో మీకు తెలుసని చెప్పిండ్రు. మంచిర్యాలతోపాటు నిర్మల్, ఆసిఫాబాద్‌లను కూడా జిల్లాలు చేయాలని గంటసేపు నాతో వాదించి ఆ జిల్లాలు అయ్యేందుకు కారణమైండు. నిర్మల్ జిల్లా ఏర్పాటు చేస్తే ఇగ ఏం అడగమని చెప్పిండు. మొన్న మెడికల్ కాలేజీ తెచ్చుకున్నడు. ఇప్పుడు ఇంజినీరింగ్ కాలేజీ అడుగుతున్నడు. మీ ఇంద్రకరణ్‌రెడ్డి సార్ బాగా హుషారున్నడు..' అని వివరించాడు.

ఇంజినీరింగ్ కూడా వస్తది..
సభలో ముందుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కూడా కావాలని అడిగారు. దీనిపై సీఎం మాట్లాడుతూ ఇంద్రకరణ్‌రెడ్డికి పుట్టిన ప్రాంతమైన నిర్మల్‌పై ప్రేమ ఉందన్నారు. అందుకే ఒకటి కాగానే ఒకటి అడుగుతూనే ఉన్నారని సీఎం అనడంతో సభలో నవ్వులు విరిశాయి. ఈ సభను చూస్తుంటేనే ఇంద్రకరణ్‌రెడ్డి గెల్సిపోయిండని తెలిసిపోతోందని, ఎన్నికల రిజల్ట్ ఈరోజే అవుట్ అయిందని కేసీఆర్ అన్నారు. ఇక 70–80వేల మెజారిటీతో ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపిస్తే జేఎన్‌టీయూ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ ఇప్పించే బాధ్యత నాదని చెప్పారు.

జిల్లాతో అనుబంధం ఉంది..
నిర్మల్ జిల్లాతో తనకు అనుబంధం ఉందని కేసీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్ ప్రాంతాలకు వచ్చానన్నారు. ఉద్యమం కంటే ముందు వేణుగోపాలచారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చాలాసార్లు ఇక్కడికి వచ్చేదని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని ఇక్కడి రైతులు వచ్చి బాధలు చెప్పుకునే వారని, ఇప్పుడు తెలంగాణలో ఆ పరిస్థితి లేదన్నారు. ఐకే రెడ్డి ఒక్కడే నిర్మల్ నియోజకవర్గానికి ఏకంగా 15 సబ్‌స్టేషన్లను తెచ్చుకున్నాడన్నారు.



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన మహిళలు, వృద్ధులు

విపత్కర పరిస్థితుల్లో బీమా అండ



విమలకు చెక్కు అందిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): విపత్కర పరిస్థితుల్లో ఎస్‌బీఐ బీమా అండగా ఉంటుందని టీజీబీ ఆర్‌ఎం జి.వెంకటరాంరెడ్డి అన్నారు. మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి చెందిన పవార్ గణేశ్ 2021లో జైనూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అప్పటికే గణేశ్ ఎస్‌బీఐలో రూ.1000 ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. గురువారం కెరమెరి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మృతుడి భార్య విమలకు రూ.20 లక్షల చెక్కు అందించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి బీమా ఆసరా నిలుస్తుందన్నారు. ప్రతీ ఖాతాదారుడు బీమా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం కోవ హన్మంత్‌రావు, ఆర్‌బీవో హబిబుల్లా, మేనేజర్ శ్రీపాద్, ఐకేపీ డీపీఎం సారయ్య, ఏపీఎం జగదీశ్వర్, అధికారులు కార్తీక్, అంజిన్, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య


బాలాజీ మృతదేహం

జన్నారం (ఖానాపూర్): ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన తుంగూరి రాఘవులు, శాంత దంపతుల కుమారుడు తుంగూరి బాలాజీ (బాలు) (19) పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల టైఫాయిడ్ జ్వరం రావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించారు. జ్వరం తగ్గినా 15 రోజులుగా స్కూలుకు వెళ్లకుండా ఇంట్లో ఉంటూ మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. ఈ నెల 1న బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. మృతుని తల్లి వచ్చి చూడగా దూలానికి వేలాడుతూ కనిపించాడు. ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి రాఘవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

బెల్లంపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గురువారం మద్యం పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. ఏరియాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బెల్లంపల్లి మండలం కాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిగిరి మహేష్ సంచిలో మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద డెక్కన్‌బ్లూ(180 ఎంఎల్) బాటిళ్లు 10, ఆఫీసర్స్ చాయిస్ (90 ఎంఎల్) బాటిళ్లు 6 లభించాయి. ఇంటి వద్ద నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

వాంకిడి(ఆసిఫాబాద్): టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రధాన మార్కెట్ ఏరియాలో నాలుగు వరుసల రహదారి పనులు కొనసాగుతున్నాయి. గురువారం వారసంత కావడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. మధ్యాహ్నం మండల కేంద్రానికి చెందిన రాంటెంకి భీంరావు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టింది. కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎస్సై సాగర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో గురువారం చేపల పెంపకంపై ఔత్సాహికులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు కొనసాగనున్న శిక్షణకు మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన 25 మంది హాజరయ్యారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ జనరల్ విజయ్‌కుమార్ ఆన్‌లైన్ విధానం ద్వారా మత్స్య సంపద పెంపకం గురించి వివరించారు. మత్స్య విభాగ అధికారి భవ్యశ్రీ చేపల పెంపకం, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, వాటిని పొందే విధానం, తదితర అంశాలను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కోర్డినేటర్ శివకృష్ణ మాట్లాడుతూ రైతులు ఆదాయం పెంచుకోవడానికి వ్యవసాయ అనుబంధ రంగాలను ఎంచుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

నెల రోజులు.. రెండు ఎన్నికలు!

- మొదట అసెంబ్లీ.. తర్వాత సింగరేణి..
- రెండు రకాల తీర్పు ఇవ్వనున్న నల్ల సూర్యులు
- సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్న కార్మిక సంఘాలు..
- ముందు పార్టీ, తర్వాత యూనియన్
- క్యాడర్‌ను సన్నద్ధం చేస్తున్న నాయకులు
- మొదలైన యూనియన్ల సమావేశాలు


ఇటీవల నస్పూర్‌లో నిర్వహించిన టీబీజీకేఎస్ సమావేశానికి హాజరైన కార్మికులు

జంగ్ తెలంగాణ

శ్రీరాంపూర్(మంచిర్యాల): కార్మికుల సమస్యలే ఎజెండాగా పనిచేసే ట్రేడ్ యూనియన్లకు అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారాయి. సాధారణ ఎన్నికలకు, సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు మధ్య ఎప్పుడూ ఎంతోకొంత కాల వ్యవధి ఉంటుంది. కానీ ఈసారి రెండూ నెల వ్యవధిలోనే రావడంతో సింగరేణి క్షేత్రం ఎన్నికలతో వేడెక్కింది. ఈ నెల 30న రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. కోర్టు తీర్పు ప్రకారం డిసెంబర్ 27న సింగరేణిలో 7వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి. నెల రోజుల్లోనే కార్మికులు తమ ఓటుతో రెండు రకాల తీర్పులు ఇవ్వబోతున్నారు. దీంతో కార్మికుల ఓట్లు సింగరేణిలో తమ ఓటు బ్యాంకును చూపెట్టుకోవడానికి ఈ అసెంబ్లీ ఎన్నికలు ప్రతిష్టాత్మకమై సెమీఫైనల్‌గా మారాయి. పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే యూనియన్‌కు సింగరేణి క్షేత్రంలో బలం ఉంటుంది. దీంతో అన్ని యూనియన్లకు తమ మాతృపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవడం తప్పనిసరైంది. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల ఓట్లు సుమారు 90 వేల వరకు ఉన్నాయి. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ల పరిధిలోని ఈ ఓటర్లు మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపుతారు. దీంతో పార్టీలు సింగరేణిలో పట్టున్న తమ అనుబంధ ట్రేడ్ యూనియన్ల నేతలను ముందుపెట్టి కార్మిక ఓట్లను ఆకర్షించే పనిలో పడ్డాయి. ఇక్కడ ప్రచార బాధ్యతలు కూడా వారి చేతుల్లోనే పెట్టారు.

మొదలైన సమావేశాలు..

ముందుగా వెలువడిన షెడ్యూల్ ప్రకారం సింగరేణి ఎన్నికలు అక్టోబర్ 28న జరగాల్సి ఉండటంతో నిన్న మొన్నటి వరకు ట్రేడ్ యూనియన్ల నేతలు వారి క్యాడర్‌ను సమీకరించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హైకోర్టు సింగరేణి ఎన్నికలను డిసెంబర్ 27కు వాయిదా వేసింది. దీంతో ప్రధాన కార్మిక సంఘాలన్నీ ముందున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవడానికి కంకణం కట్టుకుని పనిచేస్తున్నాయి. మాతృపార్టీ ఆదేశాల మేరకు ట్రేడ్‌యూనియన్లు ఎన్నికల సమావేశాలు మొదలుపెట్టి కార్మికులకు దగ్గరవుతున్నాయి. ఇందులో భాగంగానే గత నెల 29న నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శ్రీరాంపూర్ డివిజన్ టీబీజీకేఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరై సింగరేణి ఓట్లు వేయించాలని యూనియన్ల శ్రేణులకు సూచించారు. ఇదే రోజున నస్పూర్‌లో ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించింది. సింగరేణి పరిధిలో 6 జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని యూనియన్ నాయకత్వం సూచించింది. ఇక కాంగ్రెస్ పొత్తులో భాగంగా సీపీఐకి ఇచ్చే టికెట్‌పై ఇప్పటికీ స్పష్టత రాకపోవడంతో ఏఐటీయూసీ నేతలు తర్జనభర్జన పడుతున్నారు. పార్టీ నాయకత్వం నిర్ణయం మేరకు ఎక్కడ అభ్యర్థిని నిలబెట్టినా తప్పని సరిగా గెలిపించుకోవాలని, అప్పుడే సింగరేణి ఎన్నికల్లో బలం పెరుగుతుందని నేతలు భావిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడిస్తే దాని ప్రభావం సింగరేణి ఎన్నికలపై పడుతుందని, దీంతో సులువుగా సింగరేణి ఎన్నికల్లో గెలుస్తామంటూ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో సీరియస్‌గా పనిచేయాలని అన్ని పార్టీలు సింగరేణిలో అనుబంధ కార్మిక సంఘాల నాయకత్వాలకు అల్టిమేటం జారీ చేశాయి.

గనులపై ప్రచారం నిషేధించిన సింగరేణి..

ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల హడావుడి పెరుగడంతో ఇదే అదనుగా భావించిన యాజమాన్యం ఎన్నికల కోడ్‌ను కారణంగా చూపెడుతూ గనులపై ఎన్నికల ప్రచారాన్ని నిషేధిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కోడ్ అమలులో ఉన్నందువల్ల ఏ పార్టీ, కార్మిక సంఘం నేతలు, కార్యకర్తలు గనులపై సమావేశాలు జరుపరాదని, అలా చేస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించింది. దీనికి తోడు ప్రస్తుతం జరుగుతున్న సేఫ్టీ పక్షోత్సవాల్లో కూడా యూనియన్ నేతల భాగస్వామ్యం లేకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటి నుంచే గనులపైకి ప్రచారానికి అనుమతి ఇస్తే ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలతో పాటు డిసెంబర్ 27న జరిగే సింగరేణి ఎన్నికల వరకు విచ్చలవిడి ప్రచారంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని కంపెనీ భావిస్తోంది. ఏది ఏమైనా డిసెంబర్ 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలువాలంటే ముందు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సి రావడం యూనియన్లకు ప్రాణ సంకటంగా మారింది.

ఎరువుల దుకాణం లైసెన్స్ రద్దు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని గొర్లపల్లి గ్రామానికి చెందిన వినాయక ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల దుకాణం లైసెన్స్ తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు భీమిని ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అధిక ధరలు, కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు ఇవ్వడంలేదని గ్రామానికి చెందిన అరిగెల విష్ణువర్ధన్‌గౌడ్ అక్టోబర్ 20న జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశాడు. ఏడీఏ విచారణ చేయగా నిజం ధ్రువీకరణ కావడంతో తాత్కాలికంగా లైసెన్స్ రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మళ్లీ అనుమతులు ఇచ్చే వరకు ఎలాంటి అమ్మకాలు చేయకూడదని పేర్కొన్నారు.

ఆర్‌పీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీనివాస్


శ్రీనివాస్

నెన్నెల(బెల్లంపల్లి): బెల్లంపల్లి నుంచి ఆర్‌పీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా నెన్నెల మండలం కోణంపేటకు చెందిన రాంటెంకి శ్రీనివాస్‌ను ప్రకటించారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సందీప్ కండువా కప్పి శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ ఈ అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మాస్కర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉల్లాస్ పర్వీన, ఉపాధ్యక్షురాలు కార్తీ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

భూ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఘర్షణ

- కారంపొడి చల్లి బండరాళ్లతో దాడి
- నలుగురిపై కేసు నమోదు


అడ్డుకుంటున్న ఎస్సై సనత్‌కుమార్

దహెగాం(సిర్పూర్): భూమి రిజిస్ట్రేషన్ విషయంలో దాడులకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సిర్పూర్(టి)కి చెందిన ఫహిమిదా బేగం, సాజిదాబేగంకు మండలంలోని లగ్గాం శివారులో 102/ఇ/అ/2, 102/ఇ/2 సర్వే నంబరులో ఉన్న చెరో రెండెకరాల భూమిని ఇటీవల విక్రయించారు. గురువారం రిజిస్ట్రేషన్ ఉండడంతో విషయం తెలుసుకున్న మహిళల మేనళ్లుండ్లు బెజ్జూర్ మండలం కాటెపల్లికి చెందిన మస్నత్ అలీఖాన్, జిసద్ అలీఖాన్, అమీర్ అలీఖాన్, అర్భాజ్ అలీఖాన్ తహసీల్ కార్యాలయానికి వచ్చి అట్టిభూమి తమకు వీలునామాగా వచ్చిందని, అమ్మడానికి వీలు లేదని, ఈ భూమిపై కోర్టులో కేసు వేశామని, రిజిస్ట్రేషన్ ఆపాలని తహసీల్దార్‌ను కోరారు. కోర్టు నుండి ఏమైనా ఆర్డర్ ఉంటే చూపించాలని, లేదంటే రిజిస్ట్రేషన్ ఆపడం కుదరదని తహసీల్దార్ తేల్చి చెప్పారు. సాయంత్రం పట్టాదారులు రిజిస్ట్రేషన్ చేయించేందుకు కార్యాలయంలోనికి వెళ్తుండగా ఒక్కసారిగా కారంపొడి చల్లి బండరాళ్లతో దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న ఎస్సై సనత్‌కుమార్ వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫహిమిదా బేగం, సాజిదాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్నత్ అలీఖాన్, జిషాద్ అలీఖాన్, అమీర్ అలీఖాన్, అర్భాజ్‌అలీఖాన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు


మూసిఉన్న రెబ్బెన జెడ్పీ ఉన్నత పాఠశాల

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉపాధ్యాయులందరికీ మూకుమ్మడిగా ఎన్నికల విధులు అప్పగించడంతో గురువారం రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సెలవు లభించింది. ఉపాధ్యాయులంతా ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరు కావటంతో పాఠశాల తెరుచుకోలేదు. ఒకరోజు ముందుగానే సమాచారం అందించటంతో విద్యార్థులు సైతం పాఠశాలకు హాజరు కాలేదు. పాఠశాలలో హెచ్‌ఎంతో కలిసి మొత్తం 13 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల విధుల్లో భాగంగా ఉపాధ్యాయులందరికీ బూర్గుడ సమీపంలోని బీఈడీ కళాశాలలో ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవిషయమై హెచ్‌ఎం విజయరాణిని 'సాక్షి' సంప్రదించగా విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లి అతని అనుమతితో విద్యార్థులకు గురువారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

'సీనియర్లను విస్మరిస్తే ఊరుకోబోము'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: సీనియర్ నాయకులు, కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకోబోమని, మూడు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, ఎంపీటీసీ సభ్యులు దాగం రమేష్, గొలుసుల శిరీష, సీనియర్ నాయకులు దుర్గం రవీందర్, కటికల మల్లిక తెలిపారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఒకరిద్దరు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు నెన్నెలలో సభ ఏర్పాటు చేసి తమకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీని ఎదిరించి నిలబడ్డామని, సభ గురించి వెల్లడించకుండా అవమానిస్తారా అని బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌ను ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు సింగతి తిరుపతి, అర్కాల ఓదెలు, జనగామ తిరుపతి, కోట ధర్మయ్య, నాయకులు ఉయ్యాల లింగయ్య, లౌడియా రమేష్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, సంతోష్, జంపం శ్రీనివాస్, రమేష్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా యోచనలో బీఆర్‌ఎస్ సర్పంచులు?

జన్నారం: ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత లభించడం లేదనే ఉద్దేశంతో మండలానికి పలువురు బీఆర్‌ఎస్ సర్పంచులు రాజీనామా చేయడానికి యోచిస్తున్నట్లు తెలిసింది. గురువారం 8 మంది సర్పంచులు సమావేశమై రాజీనామా విషయమై చర్చించారు. రాజకీయంగా సర్పంచులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో రాజీనామాకు సిద్ధమవుతున్నామని, విషయాన్ని మరో రెండు రోజుల్లో మీడియా ముందు వివరిస్తామని సర్పంచ్ ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

4న జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 4న సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మానవజాతి ప్రయోజనం కోసం సైన్స్ టెక్నాలజీ, ఉప అంశాలుగా మిల్లెట్స్ ది సూపర్‌ఫుడ్, ఆహార భద్రత, రోజువారీ జీవితంలో ఆధునిక సాంకేతిక, ఆరోగ్య సంరక్షణలో ప్రస్తుత పురోగతులు, సమాజంలో మూఢ నమ్మకాలపై పోటీలు ఉంటాయన్నారు. నాటక వ్యవధి 30 నిముషాల కంటే ఎక్కువ ఉండరాదన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని సూచించారు.

'ఆలన' పనితీరు పరిశీలన

భీమారం: మండల కేంద్రంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు ఇంటి వద్దే వైద్యసేవలు అందిస్తున్న ఆలన బృందం పనితీరును గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వాహనంలో సిబ్బంది రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఆలన బృందాన్ని ఏర్పాటు చేసిందని జిల్లా సీహెచ్‌వో రాంమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి రాజ్‌కుమార్ తెలిపారు. రోగుల ఇంటికి వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించి అవసరమైన మందులు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబురావు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబురావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌తో ఉమ్మడి జిల్లా అండర్-19 నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, పీడీ తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదమ్ములం కలిసి అభివృద్ధి చేస్తాం

- మాజీ మంత్రి గడ్డం వినోద్


బహిరంగ సభలో మాట్లాడుతున్న గడ్డం వినోద్

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గాన్ని తమ్ముడు వివేక్, తాను కలిసి ప్రగతిపథంలో నడిపిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం వినోద్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో ఎమ్మెల్యే చిన్నయ్య నియోజకవర్గంలో చేసిందేమీ లేదని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు మండలంలో ప్రాజెక్టులు, కాలువలు, వాగులపై వంతెనలు, రోడ్ల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నెన్నెల సర్పంచ్ తోట సుజాత, కుశ్నపల్లి సర్పంచ్ సంధ్య, కిషన్‌రెడ్డి, వార్డు సభ్యులు, మైలారం ఉపసర్పంచ్‌తోపాటు మరో 2500 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి గడ్డం వినోద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట శ్రీను, మహేష్‌రెడ్డి, సాంబమూర్తిగౌడ్, చెన్నోజి శంకరయ్య, గట్టు బానేష్, మొహిద్ ఖాన్, రాజన్నయాదవ్ పాల్గొన్నారు.

చిన్నయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

- ఎంపీ వెంకటేశ్‌నేత


మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్‌నేత

కాసిపేట(బెల్లంపల్లి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి దుర్గం చిన్నయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎంపీ వెంకటేశ్‌నేత అన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో చిన్నయ్య ద్వారానే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగవద్దన్నారు. తెలిసో తెలియకో ఎవరిమనస్సైనా నొప్పిస్తే అన్యగా భావించి క్షమించాలని కోరారు. 119 నియోజకవర్గాల్లో ఏ ఎమ్మెల్యే లేని విధంగా ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కుటుంబంతో ఉండేది నేనొక్కడినేనన్నారు. ఎంతోమంది తనపై నిందలు వేసినా కేసీఆర్ తనపై నమ్మకంతో మూడోసారి టికెట్ కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రోడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్‌ఎంపీపీ విక్రంరావు, ఎన్నికల పరిశీలకుడు సుభాష్‌రావు, నాయకులు తిరుపతిరెడ్డి, భుక్య రాంచందర్, మంజులరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నీలరాంచందర్, దుర్గం పోశం, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్కే-7 గనిలో కార్మికుడు మృతి


సుర్మిళ్ల వెంకటేశ్ (ఫైల్)

శ్రీరాంపూర్: డివిజన్‌లోని ఆర్కే-7 గనిలో ఫిట్టర్ కార్మికుడు సుర్మిళ్ల వెంకటేశ్(35) అస్వస్థతతో కిందపడి మృతిచెందాడు. గురువారం మిడిల్ షిఫ్టుకు విధులకు హాజరైన అతడు భూగర్భంలోని 2 లెవల్, 8 రేస్, 2ఏ సీమ్ వద్ద విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా కింద పడిపోయాడు. తలకు గాయమై రక్తస్రావం కావడంతో తోటి ఉద్యోగులు ఉపరితలానికి, అక్కడి నుంచి రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తలకు కుట్లు వేసి చికిత్స అందించారు. గ్రూప్ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, ఫిట్ సెక్రెటరీ మెండె వెంకటి ఆస్పత్రిలో వెంకటేశ్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కొద్ది సేపటికి వెంకటేశ్‌కు గుండెనొప్పి రావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. వీరి కుటుంబం సీసీసీలోని ఆర్కే 5 కాలనీలో నివాసం ఉంటుంది. గనిలో అస్వస్థతకు కారణం వెంటిలేషన్ లేకనా ఇతర ఆరోగ్య సమస్యలతోనా అన్నది విచారణలో తేలనుంది. ప్రమాదం పూర్తి వివరాల కోసం గని మేనేజర్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. రక్షణ పక్షోత్సవాలు జరుగుతున్న తరుణంలో కార్మికుడు మృతిచెందడంతో అధికారులు తీవ్ర ఆందోళన చెందారు.

డీసీసీ అధ్యక్షురాలి పరామర్శ

మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పరామర్శించారు. గనిలో గ్యాస్ రావడంతోనే కార్మికుడు అస్వస్థతకు గురై చనిపోయాడని, కంపెనీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే వెంటిలేషన్ సరిగ్గా లేకనే సదరు కార్మికుడు చనిపోయాడని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచీ సెక్రెటరీ నాతాడి శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గని ప్రమాదంగా గుర్తించి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేకే ఓసీలో వోల్వో ట్రక్ బోల్తా


బోల్తాపడిన వోల్వో ట్రక్

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓసీలో గురువారం వోల్వో ట్రక్ బోల్తా పడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడగా పెనుప్రమాదం తప్పింది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ఆర్‌వీఆర్ కంపనీకి చెందిన వోల్వో ఓబి (మట్టి)ని తరలిస్తున్న క్రమంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. వోల్వో ట్రక్‌కు మరమ్మతులు చేయించడంలో కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు నిర్లక్ష్యం చూపడంతోనే ప్రమాదం జరిగినట్లు కార్మికులు పేర్కొంటున్నారు. ఆర్నెళ్లకాలంలో ఇదే వాహనం మూడుసార్లు బోల్తా పడిందని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. వాహనం ఫిట్‌నెస్‌పై సింగరేణి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వోల్వోను తొలగించాలని సూచించినట్లు సమాచారం.

తడి, పొడి వరి సాగుతో నీరు ఆదా


రైతులకు వివరిస్తున్న నర్సింహారెడ్డి

జన్నారం: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు అవసరమని, తడి పొడి వరి సాగు విధానంతో నీరు ఆదా చేసుకోవచ్చని ఏడీఏ అనిత, సీసీఎక్స్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. తడి పొడి పద్ధతులతో వరిసాగు విధానంపై గురువారం కలమడుగు రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పద్ధతిలో రంధ్రాలున్న ప్లాస్టిక్ గొట్టం ఉపయోగించి పొలంలో ఉండే నీటి మోతాదును గుర్తించవచ్చన్నారు. అమర్చిన గొట్టంలో మట్టిని తీసివేయడం వల్ల గొట్టం నీటిమట్టంను సూచిస్తుందన్నారు. నాటు వేసిన రెండు వారాల తర్వాత ఈ విధానం ప్రారంభించవచ్చన్నారు. ఈ పద్ధతి ద్వారా నీటి వినియోగాన్ని 10 నుంచి 30 శాతం తగ్గించవచ్చన్నారు. సమావేశంలో సర్పంచ్ కార్తీక్‌రావు, ఏవో సంగీత, ఎన్‌జీవో డైరెక్టర్ మనోహర్, ఏఈవో దివ్య, జిల్లా మేనేజర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.